## 13 ఏండ్ల బాలుడికి గుండెపోటు

- కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో ఘటన

తాళ్లపల్లి సుశాంత్ (ఫైల్)

కోనరావుపేట, డిసెంబర్ 25: గుండెపోటు వచ్చి 13 ఏండ్ల బాలుడు మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో సోమవారం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన తాళ్లపల్లి శంకర్-సరిత దంపతులకు ఇద్దరు కుమారులు జశ్వంత్, సుశాంత్(13) ఉన్నారు. దంపతులిద్దరూ కూలి పని చేస్తూ ఇద్దరు కొడుకులను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. జశ్వంత్ కోనరావుపేట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా, సుశాంత్ ముస్తాబాద్ మండలంలోని గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో క్రిస్మస్ పండుగ కోసం సుశాంత్ ఆదివారం హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. సోమవారం ఇంట్లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నాడు. మధ్యాహ్నం ఛాతీలో నొప్పి వస్తున్నదని చెప్పడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల జిల్లా దవాఖానకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేస్తుండగానే సుశాంత్ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. క్రిస్మస్ సంబురాలతో సంతోషం నిండాల్సిన వారి ఇంట్లో ఒక్కసారిగా విషాదం నెలకొన్నది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ కోరారు.

## నిర్మాణ సంస్థ డైరెక్టర్‌పై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్, డిసెంబర్ 25: నిర్మాణ పనుల బిల్లులు చెల్లించలేదనే అభియోగంపై ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ తోట సత్యనారాయణపై కోర్టు ఆదేశాల మేరకు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. షేక్‌పేట సమీపంలోని టోలీచౌకి పురానాబాగ్‌లో సుమారు 19 వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఈ సంస్థ చేపట్టిన పనుల్లో హెచ్ బ్లాక్‌లో 220 ఫ్లాట్స్ నిర్మాణాన్ని ఎస్ఎస్‌టీ బిల్డర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ సాయి తిరుమల కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు అప్పగించింది. రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మాణాలు పూర్తిచేసిన తమకు బిల్లులు చెల్లించకపోగా సదరు ఫ్లాట్స్‌ను పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో మార్టిగేజ్ పెట్టి లోన్స్ తీసుకొని సంస్థ డైరెక్టర్ సత్యనారాయణ మోసానికి పాల్పడ్డారని ఎస్ఎస్‌టీ ఎల్ఎల్‌పీ మేనేజింగ్ భాగస్వామి వాకాడ తిరుమల రావు ఇటీవల కోర్టును ఆశ్రయించారు.

## ఆర్జీవీ ఆఫీసు ఎదుట టీడీపీ శ్రేణుల నిరసన

బంజారాహిల్స్, డిసెంబర్ 25: సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ కార్యాలయం వద్ద సోమవారం టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. వ్యూహం సినిమాను నిరసిస్తూ పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 66లోని అతని కార్యాలయం వద్దకు వెళ్లి పలువురు ఆందోళన చేపట్టారు. ఆర్జీవీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, వ్యూహం చిత్రం ఫ్లెక్సీలను చించివేసి, మరికొన్నింటిని తగులబెట్టారు. దీంతో కార్యాలయ వర్గాలు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకునే సరికి ఆందోళనకారులు పరారయ్యారు.

# ఘనంగా క్రిస్మస్

రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని చర్చిలకు వెళ్లి తమకు ఆయురారోగ్యాలు కలగాలని, సిరిసంపదలు కలుగజేయాలని యేసు ప్రభువును వేడుకొన్నారు. ఇందులో భాగంగానే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ (చర్చి ఆఫ్ సౌత్ ఇండియా) కెథడ్రాల్ చర్చిలో క్రిస్మస్ సంబురాలు అంబరాన్నంటాయి. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము 4:30 గంటలకు శిలువ ఊరేగింపుతో వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కులమతాలకతీతంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పక్క పక్క రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. మొదటి ఆరాధనకు మెదక్ డయాసిస్ అధ్యక్ష మండల బిషప్ రెవరెండ్ పద్మారావు పాల్గొని భక్తులకు వాక్యోపదేశం చేశారు. అలాగే, హైదరాబాద్‌లోని కల్వరి టెంపుల్‌లో క్రైస్తవులు భారీగా తరలివచ్చి, ప్రార్థనలు చేశారు.

## 2024 ఏడాదంతా 'సీఎస్ఐ' శతాబ్ది వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 25: మెదక్ సీఎస్ఐ (చర్చి ఆఫ్ సౌత్ ఇండియా) కెథడ్రాల్ చర్చిలో సోమవారం క్రిస్మస్ సంబురాలు ఘనంగా జరిగాయి. ఇందులో నిర్వహించిన మొదటి ఆరాధనకు మెదక్ డయాసిస్ అధ్యక్ష మండల బిషప్ రెవరెండ్ పద్మారావు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆయన వాక్యోపదేశం చేస్తూ.. సీఎస్ఐ చర్చి నిర్మించి 99 ఏండ్లు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్నదని, ఈ సందర్భంగా 2024 ఏడాదంతా శతాబ్ది వేడుకలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

# కల్యాణలక్ష్మితో ఆగిన బాల్యవివాహాలు

### ఇది 2014కు ముందు..

*కొందరు మేజర్ కాకముందే ప్రేమ పెండ్లిళ్లు చేసుకున్నరు.. కొన్ని పెద్దలు చేసిన బాల్యవివాహాలూ ఉన్నయ్.. చిన్న వయసులోనే పిల్లల్ని కనటంతో చాలా మంది యువతులు అనారోగ్యానికి గురయ్యారు. ఇంకొందరు ముసలివాళ్లలా వంగిపోయారు.*

### కల్యాణలక్ష్మి వచ్చాక..

*2014లో కేసీఆర్ సర్కారు కల్యాణలక్ష్మిని తీసుకొచ్చింది. 18 ఏండ్లు దాటితేనే సర్కారు ఇచ్చే ఈ సాయం అందుతది. దాంతో బాల్యవివాహాలు ఆగిపోయాయి. మేజర్ కాక ముందు ప్రేమ పెండ్లిళ్లు నిలిచిపోయాయి. పిల్లల్ని కనే వయసు రావటంతో యువతులూ ఆరోగ్యంగా ఉంటున్నరు.*

### మైలారం గ్రామానికి వరంలా మారిన పథకం

#### మార్పు తెచ్చిన కేసీఆర్ ప్రభుత్వం

#### ఈ ఒక్క ఊరిలోనే 80 మందికి సాయం

మంచిర్యాల, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మైలారం ఒకప్పుడు బాల్య వివాహాలతో ఇబ్బందిపడ్డ ఊరే. ఏ వాడకు పోయినా 14-17 ఏండ్ల వయసులో పెండ్లి చేసుకున్నవాళ్లే కనిపించేవారు. అభం.. శుభం తెలియని వయసులో ప్రేమ పెండ్లి చేసుకొని మోసపోయినోళ్లూ ఉన్నరు. అలా ఆగమైపోయిన కుటుంబాలు ఆ ఊళ్లో 40కిపైగా ఉంటాయని గ్రామస్థులే చెప్తున్నరు. కానీ, 2014 తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కల్యాణలక్ష్మి పథకం ఎంతో మంది యువతుల్లో వెలుగులు నింపినట్టే మైలారంలోని యువతుల జీవితాల్లో సంతోషం నిండింది. ఈ పథకం వల్ల పెండ్లి కోసం 18 ఏండ్లు నిండాలన్న అవగాహన పెరిగింది. గత పదేండ్లలో ఆ ఒక్క ఊరిలోనే 80 మందికి కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ సాయం అందిందంటే అవగాహన ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. బాల్య వివాహాలు తగ్గటంతో మైలారానికి పట్టిన శని వదిలిపోయింది. 'మా ఊరి బతుకులను కల్యాణలక్ష్మి మార్చేసింది' అని గ్రామస్థులే చెప్తున్నారు.

### కల్యాణలక్ష్మితోనే పెండ్లి అప్పు కట్టినం

మాది భీమిని మండలం అక్కపెల్లి గ్రామం. మాకు 2018లో పెండ్లయ్యింది. అప్పుడు మానాన్న వద్ద పైసా లేకుండే. తెలిసినోళ్లేను అప్పు అడిగితే ఇయ్యలే. కానీ కేసీఆర్ సార్ పేదింటి ఆడపిల్లల పెండ్లికి లక్ష సాయం చేస్తున్నరని తెలిసి మా నాన్న సంబురపడ్డడు. ఓ షావుకారి దగ్గర అప్పు తెచ్చిండు. గా డబ్బులతోనే పెండ్లి చేసిండు. మాకు కల్యాణలక్ష్మి కింద పైసలు రాంగనే అప్పు కట్టినం.

- జంపం జ్యోతి భీమేశ్, మైలారం

### రూ.లక్షా నూట పదహార్లు వచ్చినయి

మేము ఆదివాసీ మన్నేవార్ గిరిజన బిడ్డలం. మా ఆడబిడ్డలు పెద్ద చదువులు చదువుతున్నరు. మా పెద్ద బిడ్డ ప్రవళిక పదో తరగతి చదివింది. ఆర్థికంగా లేక పెద్ద చదువులు చదివించలేదు. ఆమెకు 2021లో పెండ్లి చేసినం. పెండ్లి కోసం బాగా అప్పుచేసినం. బయట రూ.2 లక్షలు అప్పు తెచ్చి బిడ్డ పెండ్లి చేసినంక మాకు కల్యాణలక్ష్మి కింద రూ.1,00,116 వచ్చినయి. వాటితో సగం అప్పు తీరింది. పేదోళ్లకు రూ.లక్ష ఉన్నపలంగా రాడవడమంటే ఉట్టి మాట కాదు. మాలాంటోళ్లు ఏడాదంతా పనిచేసినా అంత డబ్బు సంపాదించం.

- ఎండల పద్మ-సత్యం, మైలారం

### నా చిన్న బిడ్డ పెండ్లి కేసీఆరే చేసిండు

మాది పేద కుటుంబం. గుడిసెలో ఉంటున్న. నాకు ఇద్దరు ఆడపిల్లలు. కూలి పని చేసుకొని బతుకుత. నా పెద్ద బిడ్డకు పదేండ్ల కింద పెండ్లి చేసిన. అక్కడా, ఇక్కడా కాళ్లావేళ్లా పడి 50 వేల దాకా అప్పు జేసి లగ్గం చేసిన. ఆ అప్పు కట్టడానికి ఐదారేండ్లు ఊడిగం చేసిన. పేదోళ్ల ఆడపిలగాండ్ల పెండ్లి చేసుకునేందుకు ఎవరూ రాకపోయేది. ఎనిమిదేండ్ల కిందట నా చిన్న బిడ్డ గట్టక్కకు పెండ్లి చేద్దామని పిలగాండ్లను చూసిన. చూసినోళ్లంతా ఎంత ఇస్తవని అడిగిండ్లు. నా దగ్గర బేడ పైసా లేదు. అప్పుడే కేసీఆర్ సారు కల్యాణలక్ష్మి పథకం తీసుకొచ్చిండు. నాకు పాణం లేసొచ్చినట్టయింది. తెలిసిన పిలగాన్ని చూసి పెండ్లి చేసిన. నెల వరకు నా ఖాతాలో రూ.50 వేలు వేసిన్రు. గా పైసలను నా బిడ్డకే ఇచ్చిన. కేసీఆరే నా చిన్న బిడ్డ పెండ్లి చేసిండు.

- అతిమెల లక్ష్మక్క, మైలారం

## మేడారం జాతరను సక్సెస్ చేయాలి

- భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క సూచన
- మేడారం జాతర పనులు, గుండ్లవాగు బ్రిడ్జి పరిశీలన

తాడ్వాయి/గోవిందరావుపేట, డిసెంబర్25: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో పనిచేసి వచ్చే ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మల మహాజాతరను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్క పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. మహాజాతరకు సంబంధించి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. అలాగే గోవిందరావుపేట మండలం పస్రా సమీపంలోని గుండ్లవాగు బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడారం జాతరను పురస్కరించుకొని బ్రిడ్జి వద్ద భక్తుల వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఎస్పీ గౌస్ ఆలం ఉన్నారు.

సోమవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో డైరీ,క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్

## పద్మశాలీలు ఆర్థికంగా బలోపేతం కావాలి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 25: పద్మశాలీలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో అఖిల భారత పద్మశాలీ ఇంజినీర్స్ విభాగం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్స్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు శ్రీధర్ ఎన్ సుంకుర్‌వార్, జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, నాయకులు మసున మోహన్ నారాయణ, నక్క వేణుమాధవ్, చంద్రమౌళి, వనం దుర్యంతల, యర్రమాద వెంకన్న, జీ రూప, అవ్వారి భాస్కర్, కచర్ల రాజ్‌కుమార్, విఠల్, నరేందర్, శ్రావణ్, సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.

## భగ్గుమన్న భూతగాదాలు

### కత్తులతో దాడి.. ఇద్దరికి తీవ్రగాయాలు

#### కారేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఘర్షణ

కారేపల్లి, డిసెంబర్ 25: భూతగాదాలతో ఇద్దరు యువకులు కత్తులతో దాడి చేసుకొని గాయపర్చుకున్నారు. ఈ ఘటన సోమవారం రాత్రి ఖమ్మం జిల్లా కారేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో చోటు చేసుకున్నది. అదే మండలం పేరుపల్లికి చెందిన కేలోతు శ్రీనివాస్, పోలంపల్లికి చెందిన బోడ అశోక్ కుటుంబాల మధ్య కొంతకాలంగా భూతగాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఇరువర్గాల వారు ఫిర్యాదు చేసుకోవడానికి పోలీస్ స్టేషన్‌కు వస్తుండగా.. ఆ సమీపంలోకి రాగానే ఘర్షణకు దిగారు. పోలంపల్లికి చెందిన అశోక్, మరొకరు కలిసి కేలోతు హేమ్లా, బుగ్గ సతీశ్‌లపై కత్తులతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో హేమ్లా పొట్టలో కత్తి దిగింది. తలకూ తీవ్రగాయమైంది. సతీశ్ కాలి తొడకు గాయమైంది. స్థానికుల సహాయంతో 108 వాహనంలో పోలీసులు గాయపడిన వారిని ఖమ్మం దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై పుష్పాల రామారావు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాణాలు తీసిన పొగమంచు

- రెండు ప్రమాదాల్లో ఆరుగురి మృతి
- శంషాబాద్‌లో 30 విమానాల మళ్లింపు
- రాష్ట్రంలోనే అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- ఎల్లో అలర్ట్ జారీ చేసిన ఐఎండీ

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం మల్లెవానికుంటతండా ప్రమాద స్థలంలో దట్టంగా మంచు

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)/నిడమనూరు/శంషాబాద్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఉదయం కురిసిన దట్టమైన పొగమంచు ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపింది. రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మరణాలకు కారణమైంది. ప్రయాణాలకు అంతరాయం కల్పించింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సుమారు 30 విమానాల దారి మళ్లింపునకు దారితీసింది. రాష్ట్రంలో చలి తీవ్రత కూడా గణనీయంగా పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో కనిష్ఠంగా 7.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీచేసింది.

### రెండుచోట్ల ఆరుగురి దుర్మరణం

దట్టమైన పొగమంచు కారణంగా రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం అర్ధరాత్రి బైక్ ఢీ కొన్న ఘటనలో ఇద్దరు చనిపోగా, అందులో ఒకరి మృతదేహాన్ని చూసేందుకు ఆటోలో వెళ్తుండగా, లారీ ఢీ కొట్టడంతో మరో నలుగురు దుర్మరణం చెందారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం మల్లెవానికుంటతండాలో విషాదం నెలకొన్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెవానికుంటతండాకు చెందిన రమావత్ శివ (19) డీజే ఆపరేటర్. అతడు ఆదివారం అర్ధరాత్రి మిర్యాలగూడ నుంచి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. నిడమనూరు మండలం వేంపాడు స్టేజీ వద్ద దుకాణం నిర్వహిస్తున్న గ్రామస్థుడు బల్గూరి సైదులు (60) మూత్ర విసర్జన చేసి రోడ్డు దాటుతుండగా.. బైక్‌పై వేగంగా వస్తున్న శివ పొగమంచులో కనబడక ఢీకొట్టాడు. దాంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందారు. శివ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు 108 వాహనంలో మిర్యాలగూడ దవాఖానకు తరలిస్తుండగా శివ మార్గమధ్యంలో చనిపోయాడు.

### శివ కోసం వస్తూ.. మరో నలుగురు..

శివ మరణ వార్త తెలుసుకున్న అతడి కుటుంబ సభ్యులు సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో టాటా ఏస్ వాహనంలో మిర్యాలగూడ దవాఖానకు బయల్దేరారు. వేంపాడు శివారులోని సాయిబాబా విగ్రహం వద్దకు రాగానే.. దట్టమైన పొగమంచులోనూ అతి వేగంగా వస్తున్న లారీ.. టాటా ఏస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మృతుడు శివ పెద్దనాన్న రమావత్ గన్యా (40), మేనత్త మూడావత్ బుజ్జి (38), బావ దూపావత్ నాగరాజు (28), పూల్యాతండాకు చెందిన ఆటో డ్రైవర్ రమావత్ పాండు (28) అక్కడికక్కడే మరణించారు. శివ తండ్రి రమావత్ ప్రభాకర్, బంధువులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను, మృతదేహాలను పోలీసులు మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు.

### విమానాల రాకపోకలకు అంతరాయం

దట్టమైన పొగమంచు కారణంగా సోమవారం ఉదయం శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 30 విమానాలను అధికారులు దారి మళ్లించారు. పొగమంచు దట్టంగా కురవడంతో 300 మీటర్ల దూరంలో ఏమనున్నదో కనిపించని పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో మస్కట్, జెడ్డా, రియాద్ నుంచి శంషాబాద్ రావాల్సిన అంతర్జాతీయ విమానాలను బెంగళూరుకు మళ్లించినట్టు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. బెంగళూరు, తిరువనంతపురం, గోవా నుంచి రావాల్సిన ఎయిర్ ఇండియా, విస్తారా, స్పైస్ జెట్, స్టార్ అలయెన్స్ విమానాలను ఏపీలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకుకు మళ్లించినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆది, సోమవారం ఉదయం 8.30 గంటల వరకు పొగమంచు భారీగా కురియడంతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బెంగళూరు-హైదరాబాద్ విమానం తిరిగి బెంగళూరుకు, ముంబై-హైదరాబాద్ విమానం తిరిగి ముంబైకి పంపించారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

1. రమావత్ శివకేశవులు
2. రమావత్ ఘన్యా
3. దూపావత్ నాగరాజు
4. రమావత్ పాండునాయక్
5. మూడావత్ బుజ్జి

### రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

రాష్ట్రంలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి తీవ్రత పెరిగింది. ఉదయం 10 గంటలైనా మంచు దుప్పటి తొలగడం లేదు.ఇక పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు, ఆఫీసులు, ఇతర పనులకు ప్రజలు పొగమంచులోనే వణుకుతూ వెళ్తున్నారు. 2 రోజుల క్రితంతో పోలిస్తే ఆదివారం రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 8, గిన్నెధరిలో 8, బేలలో 9.1, బజార్‌హత్నూర్‌లో 9.3, నిర్మల్‌లో 9.5, డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్ జంట నగరాల్లో అత్యల్పంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో మూడు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు మూడు రోజులపాటు ఎల్లో అలర్ట్ జారీచేశారు. ఉత్తర, ఈశాన్య దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం ఎక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. చలికి తోడుగా భారీగా పొగ మంచు కురుస్తుండటంతో రహదారులపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో వృద్ధులు గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరించారు.